సాక్షి
ఖమ్మం
సోమవారం। 16 । డిసెంబర్ । 2024



బంతిసాగు.. భలే బాగు..
వాణిజ్య పంటలతో పోలిస్తే బంతిపూలతో లాభాలు అధికంగా వస్తుండడంతో పలువురు రైతులు ఆ పంటే సాగు చేస్తున్నారు. 8లో



సైబర్.. సరికొత్త పంథా
సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారు. రకరకాల ఎత్తుగడలతో ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 12°
వాతావరణం
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదవుతాయి. రాత్రికి మాత్రం చలి పెరిగే అవకాశం ఉంది.

తొలిరోజు ప్రశాంతం

- 85 కేంద్రాల్లో గ్రూప్ – 2 పరీక్ష
- సెంటర్ల వద్ద పటిష్ట బందోబస్తు
- చివరి క్షణంలో అభ్యర్థుల ఉరుకులు.. పరుగులు

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో తొలిరోజు ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 85 కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 : 30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 : 30 వరకు పరీక్షలు జరగగా ఉదయం సెషన్‌లో 8 : 30 నుంచి 9 : 30 గంటల వరకు, మధ్యాహ్నం 1 : 30 నుంచి 2 : 30 గంటల వరకు మాత్రమే అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

మొత్తం 28,101 మంది అభ్యర్థులు..
జిల్లాలో మొత్తం 28,101 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 85 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఎంతమంది హాజరయ్యారు, ఎందరు గైర్హాజరయ్యే వివరాలను అధికారులు వెల్లడించలేదు. ఇదిలా ఉండగా కొందరు చిన్నపిల్లలను తీసుకొని పరీక్ష కేంద్రానికి రాగా.. అభ్యర్థులు పరీక్షకు వెళ్లడంతో బంధువులు వారిని ఆడిస్తూ కనిపించారు.

భారీ బందోబస్తు..
పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి పంపించారు. కొందరు సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని తీసుకుని రాగా వాటిని క్లాక్‌రూమ్‌ల్లో భద్రపర్చారు. షూ, ఇతర వస్తువులతో వచ్చిన వారిని అవి తొలగించిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించారు.

కొణిజర్లలో..
కొణిజర్ల : తనికెళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ అలోషియస్ పాఠశాల, బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల, విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ – 2 పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. పల్లిపాడులోని కార్తీక్ విద్యాలయం వద్ద బ్యాగుతో వస్తున్న మహిళను నిర్వాహకులు అడ్డుకోగా దూర ప్రాంతం నుంచి వస్తున్న అభ్యర్థులకు ఏర్పాట్లు చేయలేదంటూ ఆమె హల్‌చల్ చేసింది. సెంటర్‌లో క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని ఇన్విజిలేటర్లతో గొడవకు దిగింది. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు తాము ఎలాంటి వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం లేదని సీఎస్ మాధవరెడ్డి తెలిపారు.



ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల వద్ద అభ్యర్థుల కోలాహలం



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



చిన్నారితో కలిసి పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థి



చివరి నిమిషంలో పరిగెడుతూ..

ఉరుకులు.. పరుగులు..
కొద్ది మంది అభ్యర్థులు చివరి క్షణంలో ఉరుకులు పరుగులు పెట్టారు. నిబంధనలు కఠినం చేస్తూ ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలని అధికారులు అనేక రోజులుగా సూచిస్తున్నా.. కొందరిలో మార్పు రావడం లేదు. చివరి క్షణంలో ఉరుకులు, పరుగులతో హడావిడి చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు అభ్యర్థులు వారికి కేటాయించిన కేంద్రానికి కాకుండా ఇతర సెంటర్లకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి తాము రాయాల్సిన పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు నానా తంటాలు పడ్డారు. పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగానే రావాలని అధికారులు వెల్లడించారు. అయినా జిల్లా వ్యాప్తంగా సుమారు 15 మంది ఆలస్యంగా రావడంతో వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు.

విశిష్టమైనది ‘ధనుర్మాసం’

- నేటి నుంచి నెల పాటు వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు
- గోదాదేవి, శ్రీ రంగనాథ స్వామి కల్యాణం ఓ ప్రత్యేకం
- వచ్చేనెల 10న వైకుంఠ ఏకాదశి, అదే నెలలో సంక్రాంతి సంబురాలు

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతికి ముందు 30రోజుల కాలానికి ధనుర్మాసంగా ప్రత్యేకత ఉంది. ఈ నెల రోజుల పాటు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాల్లో భగవంతుడిని కొలవడంతో పాటు, ఇళ్లలో సంక్రాంతి సంబురాలను జరుపుకోవడం ఈ మాస ప్రత్యేకం. ఈ మాసంలో శ్రీ మహావిష్ణువును ప్రత్యేకంగా కొలుస్తారు. కాలాన్ని కొలిచేందుకు అనేక కొలమానాలు ఉన్నాయి. వాటిలో చాంద్రమాన, సౌరమానాలు ప్రధానమైనవి. చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటే దాన్ని బట్టి చాంద్రమానాన్ని లెక్కిస్తారు. సూర్యుడు ఒక్కో రాశిని దాటడాన్ని బట్టి సౌరమానాన్ని లెక్కిస్తారు. సూర్యుడు ప్రవేశించిన సమయాన్ని సంక్రమణం అంటారు. ఆయా రాశుల్లో సూర్యుడు సంచరించే కాలాన్ని సౌరమానం అంటారు. ధనస్సు రాశిలో ఉండే కాలాన్ని ధనుర్మాసం అంటారు. ఖగోళ శాస్త్ర ప్రకారం చంద్రుడు పౌర్ణమి రోజున మృగశిర నక్షత్రం నందు ఉండటం వలన సౌరమానం ప్రకారం సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన రోజు నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకు గల మధ్య కాలాన్ని ధనుర్మాసంగా వ్యవహరిస్తారు. సంక్రాంతికి ముందు 30 రోజులు ఈ కాలం ఉంటుంది. పురాణాలు చెప్పిన విధంగా ఈ నెలలో రాత్రి వేళ ఎక్కువ ఉండి పగటి సమయం తక్కువ ఉంటుంది. ధనుర్మాసం ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు ఉంటుంది. ఈ నెల రోజుల పాటు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. జిల్లాలోని శ్రీ వైష్ణవ ఆలయాల్లో ఈ మాస మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలోని త్రీటౌన్‌లో గల శ్రీ లక్ష్మీ రంగనాథస్వామి ఆలయంలో నెల రోజుల పాటు ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. నగరంలోని కమాన్ బజార్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఖమ్మం నగరం నడిబొడ్డున గుట్టపై ఉన్న శ్రీ స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో, నగరంలోని శ్రీ రామాలయాల్లో, కాల్వొడ్డు, ఇతర ప్రాంతాల్లో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు జరుపుకునేందుకు అంతా రంగం సిద్ధం చేశారు.

శ్రీ మహా విష్ణువుకు ప్రీతిపాత్రం
ధనుర్మాసం శ్రీ మహా విష్ణువుకు ఎంతో ప్రీతికరమైంది. వైష్ణవ దేవాలయాల్లో ఈ నెల మొత్తం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మాసంలో సాత్వికమైన ఆరాధనలు చేస్తారు. గోదాదేవి కథ ఈ మాసంలోనిదే. ఈ మాసంలో లక్ష్మీనారాయణుడిని తులసీదళంతో పూజించడం పుణ్యప్రదమని అంటారు. ఆధ్యాత్మికంగా మానసిక శక్తిని ఇచ్చే ఈ మాసంలో వచ్చే గురువారాల్లో మహాలక్ష్మిని పూజిస్తారు. మహాలక్ష్మి పూజతో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని నమ్మకం. ఈ నెలలో సౌందర్య రాశి గోదాదేవి తన తండ్రి ద్వారా పూలను శ్రీ రంగనాథస్వామికి సమర్పిస్తుంది. ఆ పూలతో అర్చకులు స్వామి వారిని అలంకరించే వారు. గోదాదేవి స్వామి వారిపై ప్రేమను పెంచుకుంటుంది. గోదాదేవికి తనపై ఉన్న ఇష్టాన్ని గుర్తించిన శ్రీ రంగనాథస్వామి ఆమెను వివాహమాడాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ తర్వాత గోదాదేవిని ఆండాళ్‌గా పిలువబడుతుంది.

ముక్కోటి ఏకాదశి ఓ ప్రత్యేకం
ధనుర్మాసంలోనే ముక్కోటి ఏకాదశి వస్తుంది. ముక్కోటి ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా పిలుచుకుంటారు. ఈ రోజున అంతా ఉత్తర ద్వారాన స్వామి వారిని దర్శించుకుంటారు. తులసి మాలలను స్వామి వారికి సమర్పిస్తారు. ముక్కోటి ఏకాదశి కాలంలో వైష్ణవ ఆలయాలు భక్తులతో కళకళలాడుతుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్త్రీలు, ముత్తయిదువలు తులసికోటను అందంగా అలంకరించి దీపారాధన చేసి ప్రదక్షిణలు చేస్తారు. ఈ పూజతో మనోవాంఛలు నెరవేరుతాయని పెద్దలు చెబుతుంటారు. జనవరి 10న జరుపుకునే ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ఉత్తర ద్వారదర్శనం చేసుకుంటారు.



ఖమ్మం త్రీటౌన్‌లోని శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి ఆలయం

సంక్రాంతి సంబురాల మాసం
ఈ నెల పాటు బాలికలు, మహిళలు తమ ఇళ్ల ముందు ప్రతి రోజు అందమైన సంక్రాంతి ముగ్గులు వేసి ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి ముగ్గుల మధ్యలో పెడతారు. అవి లక్ష్మీదేవి రూపంగా భావిస్తూ పూలు, పసుపు, కుంకుమలతో పూజిస్తారు. ఆలయాల్లో గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తారు. సంక్రాంతి చివరి రోజున రథం ముగ్గువేసి అమ్మవారిని ఊరేగిస్తున్నట్లుగా ఇంటి ముందు వేసి తాడును పక్కింటి వరకు వారు వేసిన ముగ్గుకు కలిపి ఒక వరుసలో రథయాత్ర చేస్తారు. హరిదాసులు, హరిభక్తులు ఇళ్ల ముందుకు వచ్చి హరికీర్తనలు పాడుతూ ఇంటింటికీ తిరుగుతారు. సంక్రాంతి ముందు గంగిరెద్దుల వాళ్లు ఊరేగింపుగా ప్రతీ ఇంటికి వస్తారు. గంగిరెద్దులకు కొత్త బట్టలు ఇచ్చి సత్కరిస్తారు.

న్యూస్‌రీల్

‘ఓపెన్’తో ఉన్నత చదువులకు అనుకూలం



సెంటర్‌ను పరిశీలిస్తున్న అనురాధ తదితరులు

ముదిగొండ : చదువు మధ్యలో ఆపిన వారు సార్వత్రిక విధానంతో ఉన్నత చదువులకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని ఓపెన్ స్కూల్ తరగతుల రాష్ట్ర కో ఆర్డినేటర్ అనురాధ అన్నారు. మండలంలోని చిరుమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతుల కేంద్రాన్ని ఆదివారం జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వయసు, విద్యార్హతతో సంబంధం లేకుండా పదో తరగతి, ఇంటర్ చదివే అవకాశాలున్న ప్రతీ ఒక్కరు వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రతీ ఆదివారం, రెండో శనివారాల్లో తరగతులు ఉంటాయని చెప్పారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఈనెల 16న ఆఖరు తేదీ అని, చిరుద్యోగులు, ఉన్నత చదువుల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ మండల కో ఆర్డినేటర్ ఎస్‌కే నాజర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నవాబ్‌పాషా, నిర్మల పాల్గొన్నారు.

జిల్లా ఆర్చరీ జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా ఆర్చరీ అసోసియేషన్ నేతృత్వంలో ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పుట్టా శంకరయ్య, ప్రతినిధి డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్షులు నారాయణరావు, అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారుడు మారెప్ప, నగేశ్ పోటీలను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 50 మంది బాలురు, 25 మంది బాలికలు హాజరయ్యారు. జిల్లా సబ్ జూనియర్ బాలుర ఇండియాన్ రౌండ్‌లో జి.హర్షకమల్, కె.రాంచరణ్, వి.సంతోష్, ఆర్.భార్గవ్, బాలికల్లో ఎం.గౌతమి, ఈ.అవంతిక, కె.నందుజ, ఎం.మధుప్రియ, రికర్వ్ బాలుర జట్టులో కొమరం అశ్విత, తాళ్లూరి వెంకటయోగీశ్వర, డి.ఆదిత్య, తుంబూరూ మోక్షనాష్‌రెడ్డి ఉన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైవారు పాల్గొంటారని జిల్లా కార్యదర్శి శంకరయ్య తెలిపారు.

ఉపాధి ఉరకలు..

జిల్లాలో ఈ ఏడాది 87 శాతం పనిదినాలు పూర్తి
- 54,23,950 పనిదినాలు పూర్తి చేసిన 1.82 లక్షల కుటుంబాలు
- 98 శాతంతో మొదటి స్థానంలో ఏన్కూరు, కామేపల్లి
- ఇప్పటివరకు రూ.162 కోట్ల వ్యయం

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ నిరుపేదలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నారు. 100 రోజుల పనులు కాస్త పనికోరినప్పుడల్లా పనిచూపించే విధంగా పథకాన్ని ప్రభుత్వాలు రూపొందించాయి. ప్రతి ఏడాది 50 లక్షల నుంచి 60 లక్షల వరకు పనిదినాలు కల్పించే విధంగా లక్ష్యాలను రూపొందిస్తున్నాయి. 2024–25 ఏడాదిలో జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం 55.89 లక్షల పనిదినాలను కూలీలకు కల్పించాలని నిర్దేశించగా.. కేంద్ర ప్రభుత్వం ఆ సంఖ్యను 62.16 లక్షల పనిదినాలకు పెంచింది. దీంతో జిల్లాలో అందుకు అనుగుణంగా అధికారులు పనులను గుర్తించి కూలీలతో పనులు చేయిస్తూ వచ్చారు. ఈ ఏడాది ప్రారంభంలో ఎండలు అధికంగా ఉన్నప్పటికీ ఉపాధి పనులు చేసేందుకు కూలీలు మాత్రం భారీ సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను వినియోగించుకొని గ్రామీణ ప్రాంత కూలీలు వేసవి భత్యం పొందుతున్నారు.

87 శాతం లక్ష్యం పూర్తి..
జిల్లాలో కుటుంబాలు ఉపాధి హామీ పథకం కింద 2024–25లో 1.82 లక్షల కుటుంబాలు పని చేయగా.. ఆయా కుటుంబాల నుంచి 3.07 లక్షల మంది ఉపాధి పనులు చేశారు. వీరికి మెటీరియల్, కూలీల వేతనాలకు రూ.162 కోట్లను ఖర్చు చేశారు. ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వం 62,16,514 పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటి వరకు 54,23,950 పని దినాలను కూలీలు పూర్తి చేశారు. జిల్లాలో ఉపాధి పనికి అర్హుడైన ప్రతి కూలీని పథకం కింద వినియోగించుకుని ఉపాధి పనికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 10వ తేదీ నాటికి 87 శాతం వరకు లక్ష్యం పూర్తయింది.

రూ.162.81 కోట్లు ఖర్చు..
2024–25లో జిల్లాలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు ప్రభుత్వం రూ.162.81 కోట్లు ఖర్చు చేసింది. 3.07 లక్షల మంది కూలీలు పనులు ఉపయోగించుకోగా.. వీరికి వేతనంగా రూ.117.96 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మెటీరియల్‌కు రూ.36.85 కోట్లు, అధికారులు, సిబ్బంది జీతాలకు రూ.7.99 కోట్లను ఖర్చు చేసింది. కూలీ దొరకని ప్రతి పేదవాడికి పని కల్పించి పనికి సరిపడా వేతనం దక్కేలా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధి హామీ పథకం జిల్లాలో లక్ష్యానికి చేరువలో నిలిచింది.

కొనసాగుతున్న పనులు..
ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో పలు పనులు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిర్మాణాలను ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. ఇక గ్రామ పంచాయతీల్లోని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన నర్సరీల నిర్వహణ పనులు, బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కల పెంపకం ఉపాధి కూలీలతోనే చేయిస్తున్నారు.



ముదిగొండలోని పంచాయతీ నర్సరీలో పనులను పరిశీలిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

రెండు మండలాల్లో 98 శాతం..
జిల్లాలోని 20 మండలాల్లో ఉపాధి హామీ పనులకు కూలీలు భారీగానే హాజరయ్యారు. ఈ ఏడాదిలో నిర్దేశించిన పనిదినాల లక్ష్యం 2025 మార్చి వరకు కొనసాగనుంది. నాటి వరకు ఈ ఏడాది పనిదినాల లక్ష్యాన్ని కూలీలతో అధికారులు పూర్తి చేయించాల్సి ఉంది. ప్రస్తుతం నర్సరీల్లో మొక్కల పెంపకంలో కూలీలు ఎక్కువగా పని చేస్తున్నారు. ఇక జిల్లాలో ఏన్కూరు, కామేపల్లి మండలాల్లో 98 శాతం పని దినాలను పూర్తి చేసిన మండలాలుగా మొదటి స్థానాల్లో ఉన్నాయి. ఇక 72 శాతం పని దినాలు పూర్తి చేసిన మండలంగా ఉన్న ముదిగొండ చివరిస్థానంలో ఉంది.

జిల్లాలో ఉపాధి హామీ పథకం వివరాలు ఇలా..

జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు	3.06 లక్షలు
కూలీల సంఖ్య	6.43 లక్షలు
ఈ ఏడాది పని చేసిన కుటుంబాలు	1.82 లక్షలు
ఈ ఏడాది పనికి వెళ్లిన కూలీలు	3.07 లక్షలు
ఈ ఏడాది పనిదినాల లక్ష్యం	62.17 లక్షలు
వంద రోజుల పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాలు	688

తెలుగు సాహిత్యంలో కవిత్వానికి విశిష్టత

ఈస్తటిక్స్ పురస్కారాల సభలో కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు సాహిత్యంలో కవిత్వానికి, కథలకు విశిష్ట స్థానం ఉందని స్త్రీ వాద రచయిత ఓల్గా, కవులు అక్కినేని కుటుంబరావు, ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్, ఉష, ఎస్.డాని, ఎస్. రఘు తెలిపారు. ఆదివారం స్థానిక డీపీఆర్‌సీ హాల్‌లో కవి రవిమారుత్ అధ్యక్షతన ఈస్తటిక్స్ పురస్కారాల సభ జరిగింది. ఈ సందర్భంగా ఓల్గా తదితరులు మాట్లాడుతూ.. కవులను ప్రోత్సహించేందుకు ఖమ్మం ఈస్తటిక్స్ నిర్వహిస్తున్న పురస్కారాలు ఎంతో అభినందనీయమని అన్నారు. ఈస్తటిక్స్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. సాహిత్య పోటీలకు తెలుగు కవుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. 120కి పైగా కవితా సంపుటులు, 140కి పైగా కథలు వచ్చాయని తెలిపారు. కవిత్వం విభాగంలో జూకం జగన్నాథం కవితా సంపుటి ‘ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు’ రూ.40 వేల బహుమతి గెలుచుకుందన్నారు. రాళ్లబండి శశిశ్రీ కవితా సంపుటి ‘అనుమంద్రం’, తెలుగు వెంకటేష్ కవితా సంపుటి ‘కబోది చేపల కబుర్లు’ ప్రత్యేక ప్రశంసకు అర్హత సాధించాయని వివరించారు. ఎస్.గోపి కవితా సంపుటి ‘క్రియ ఒక జీవన లయ’ విశిష్ట పురస్కారానికి ఎంపికవగా, ఉత్తమ కథగా మన్‌సీత్ ‘నూరేళ్ల మోసే తల్లి కథ’ రూ. 25 వేల బహుమతిని గెలుచుకుందన్నారు. ద్వితీయ కథగా సయ్యద్ గఫార్ ‘న్యూబాబాయిజం’ రూ. 15 వేల బహుమతి, తృతీయ ఉత్తమ కథగా కరీం ‘ఝూజా’ రూ. 10 వేల బహుమతులు గెలుపొందారని తెలిపారు. బహుమతులు గెలుచుకున్న కథలతో పాటు పోటీకి వచ్చిన 12 కథలను ఒక సంపటిగా ప్రచురించామని తెలిపారు. పోటీల న్యాయ నిర్ణేతలకు ఈస్తటిక్స్ కమిటీ సభ్యులు రవిమారుత్, ప్రసేన్, సీతారాం, వంశీకృష్ణ, మువ్వా శ్రీనివాసరావు, పగిడపల్లి వెంకటేశ్వర్లు, ఫణి మాధవి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



కథల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం

- అభివృద్ధికి కేరాఫ్‌గా మధిర
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

మధిర: మధిర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, అభివృద్ధికి కేరాఫ్‌గా మధిరను మార్చుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రూ.19 కోట్లతో నిర్మించనున్న సైడ్ డ్రెయినేజీ, ఫుట్‌పాత్ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధిరలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. భవిష్యత్‌లో ఇతర ప్రాంతాల వారు కూడా మధిరలో స్థిర పడేందుకు ఆసక్తి చూపేలా మౌలిక వసతులు మెరుగు పరుస్తామని చెప్పారు. తనను నాలుగు సార్లు గెలిపించిన మధిర ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా చండీహోమం

పాల్వంచ: మండలంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో ఆదివారం వైభవంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి యాగశాలకు తీసుకొచ్చి మండపారాధన, గణపతి పూజ జరిపించారు. అనంతరం వేదపండితులు చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆదివారం కావడంతో భక్తులు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రాగా, ఆలయం కిటకిటలాడింది.



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా



వైశాలిని అభినందిస్తున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి జూనియర్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మానికి చెందిన బి.వైశాలి పెంటాథిలిన్ ఈవెంట్‌లో ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం సాధించిందని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష్య, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్, కోశాధికారి ఎం.సుధాకర్, సభ్యులు కృష్ణయ్య, రవి, నవీద్.. వైశాలిని అభినందించారు.

జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ ఎంపికలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చూపిన అథ్లెట్లను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు క్రాస్ కంట్రీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డి.షఫీక్ అహ్మద్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 22న నాగర్‌కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-16 బాలురలో డి.ఈశ్వర్, పి.ముఖేష్, అండర్-18 బాలురలో జె.అనిల్, జి.వెంకటసాయి పురుషుల విభాగంలో ఎల్. విక్రం, డి.గణేష్, మహిళల్లో ఎస్.కె.సమ్రీన్ ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ కోచ్ ఎం.డి.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'నిశి' నాటిక



'నిశి' నాటికలో సన్నివేశాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని భక్త రామదాస్ కళాక్షేత్రంలో నెల నెలా వెన్నెల 89వ అభ్యుదయ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన 'నిశి' నాటిక అలరించింది. శ్రీనివాసరావు పోలుదాసు రచన, దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ నాటికను వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళా సాంస్కృతిక బృందం ప్రదర్శించింది. నెల నెలా వెన్నెల వ్యవస్థాపక సభ్యులు 'కళాబంధు' డాక్టర్ బుగ్గవీటి నరసింహారావు స్మారకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత నరసింహారావు చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ మాట్లాడుతూ.. సమాజ హితాన్ని కోరుకునే విధంగా నెల నెలా వెన్నెల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కోన చంద్రశేఖర్‌గుప్తా, ఆర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, దేవేంద్ర, వేముల సదానందం, రవీందర్, నందిగామ కృష్ణ, వంకాయల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్ (ఖమ్మంమామిళ్లగూడెం): రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్ని మండల కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను నిరాశ పర్చిందని, పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తోందని, రైతులపై లాఠీచార్జ్, భాష్పవాయువు గోళాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు.

పేకాట స్థావరంపై దాడి

తల్లాడ: మండలంలోని రామానుజవరం గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రామానుజవరం ఊరి వెలుపల పేకాట ఆడుతుండగా ఎస్‌ఐ బి.కొండల్‌రావు అధ్వర్యంలో దాడి చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12 వేల నగదు, ఆటో, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడిచేసిన సంఘటన ఆదివారం మండలంలోని పెంట్లం పంచాయతీ జగన్నాథపురం గ్రామశివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామ శివారులోని పామాయిల్ తోటలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈక్రమంలో ఆరుగురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.51,550లు నగదుతో పాటు నాలుగు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఎస్‌ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఏఎస్‌ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బంతి సాగు.. భలే బాగు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

- ఎకరానికి రూ.లక్ష నికర లాభం
- 1,200 ఎకరాల మేర సాగు చేస్తున్న జిల్లా రైతులు
- ప్రభుత్వం రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే పెరగనున్న విస్తీర్ణం





కళకళలాడుతున్న బంతిపూల తోట (ఇన్‌సెట్) తోట వద్దే కొనుగోలు చేస్తున్న చిరు వ్యాపారులు

మధిర: వాణిజ్య పంటలతో పోలిస్తే బంతి సాగు బాగుంటోందని రైతులు నమ్ముతున్నారు. ఒకరిని చూసి ఇంకొకరు ఇలా జిల్లాలోని పలువురు ఈ పూల సాగుకు ముందుకొస్తున్నారు. ఏటా దసరా నుంచి మొదలై దీపావళి, కార్తీక మాసం, అయ్యప్ప మాలధారణ సీజన్‌లో సాగయ్యే ఈ పూలకు స్థానికంగా మంచి డిమాండ్ ఉంటోంది. అలాగే, వివాహ ముహూర్తాలు ఉన్న సమయాన పలువురు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఎక్కడకు వెళ్లకుండానే ఆదాయం ఆర్జిస్తున్నారు. పత్తి, మిర్చి తదితర పంటలు సాగు చేసి రూ.లక్షలు పెట్టుబడి పెట్టగా ప్రకృతి వైపరీత్యం, మార్కెటింగ్ లేకపోవడం, మద్దతు ధర దక్కక నష్టాలు వస్తున్నాయి. ఇక మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసి నెలలు వేచిచూసినా నష్టాలే తప్ప లాభాలు రావడం లేదు. ఈ నేపథ్యాన పూల సాగుకు పెట్టుబడి తక్కువగా ఉండటం, నికర ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో పలువురు రైతులు మక్కువ కనబరుస్తున్నారు.

అటు జర్బెరా.. ఇటు బంతి

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పూల సాగుపై దృష్టి సారించారు మధిరకు చెందిన మల్లాది హనుమంతరావు. ఆత్కూరు సమీపాన తునికిపాడు రోడ్డులో ఇప్పటికే రెండు ఎకరాల్లో జర్బెరా పూల సాగు చేస్తున్నారు. జర్బెరా పూలు ఎక్కువగా ఫంక్షన్లలో అలంకరణకు వినియోగిస్తుంటారు. దీనికి ప్రత్యామ్నాయంగా సీజన్, అన్ సీజన్ అని తేడా లేకుండా అందరూ ఉపయోగించే బంతి పూల సాగుపైనా దృష్టి పెట్టారు. ఏపీలోని కృష్ణా జిల్లా మదనపల్లి, ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు నర్సరీల నుంచి పసుపు, ఆరంజ్ రంగుల బంతి నారు తీసుకొచ్చి 1.20 ఎకరాల్లో సాగు చేశారు. ఆయనతో పాటు మరికొందరు రైతులు కూడా బంతి పూల సాగు చేయగా ఇటీవల ముగిసిన కార్తీక మాసం వరకు పూల అమ్మకాలు జోరుగా సాగాయి. ఇప్పుడు అయ్యప్ప దీక్షల సీజన్ కావడంతో పడి పూజ, ఇతర పూజలకు వినియోగం బాగానే ఉండటంతో కేజీ రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. ఎక్కువగా స్థానికంగా అమ్ముడవుతుండటంతో విజయవాడ, ఖమ్మం మార్కెట్లకు ఎగుమతి చేయాల్సిన ఇక్కట్లు కూడా లేవని రైతులు చెబుతున్నారు.

మధిర నియోజకవర్గంలో..

మధిర నియోజకవర్గంలో మున్నేరు, కట్టలేరు, వైరా నదులు ప్రవహిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలకు కూడా ఇక్కట్లు ఎదురుకావు. వీటి ఆధారంగా ఎక్కువ మంది రైతులు మెట్ట పంటలు పండిస్తున్నారు. ఇటీవల పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటల సాగుతో నష్టాలు ఎదురుకావడంతో పూల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మధిర నియోజకవర్గం ఆంధ్రాకు సరిహద్దులో ఉండటంతో అక్కడి నుంచి సొంత అవసరాలకు కొందరు, వ్యాపారులు కొంతమంది నేరుగా వచ్చి బంతిపూలు తోటల వద్దే కొనుగోలు చేస్తున్నారు. అందుబాటులో తాజా పూలు లభిస్తుండటంతో అటు ఏపీ వాసులేగాక ఇటు జిల్లా ప్రజలు కూడా మధిర ప్రాంతానికి వస్తున్నారు. మధిర నియోజకవర్గంలో సుమారు 300 ఎకరాల్లో బంతి సహా వివిధ రకాల పూల తోటలు సాగవుతుండగా జిల్లాలో 1,200 ఎకరాలకు పైగానే సాగుచేసినట్లు అంచనా. అయితే, ప్రభుత్వం పూలు సాగు చేసే రైతులకు సబ్సిడీపై నారు, డ్రిప్ పరికరాలు అందించడమే కాక బ్యాంకు రుణాలు ఇప్పించి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత మంది రైతులు ముందుకొచ్చే అవకాశముంది.

పూల సాగు బాగుంది..



తక్కువ పెట్టుబడి అవసరమయ్యే పూల సాగుతో అన్ని ఖర్చులు పోగా ఎకరానికి రూ.లక్ష లాభం తగ్గదు. వాణిజ్య పంటలు సాగు చేస్తే ఎప్పుడు ధర ఎలా ఉంటుందో తెలియదు. కానీ పూలసాగులో ఆదాయం ఆశాజనకంగా ఉంటోంది. వచ్చే సీజన్ నాటికి సాగు విస్తీర్ణం మరింత పెంచాలనే ఆలోచనలో ఉన్నాను.

–మల్లాది హనుమంతరావు, మధిర

రైతులకు సలహాలు, సూచనలు

జిల్లాలో ప్రస్తుతం 1,200 ఎకరాల్లో పూలసాగు చేస్తున్నారు. ఎక్కువగా ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కొణిజర్ల, మధిర, బోనకల్, ఎర్రుపాలెం, చింతకాని తదితర మండలాల్లో పూల సాగు ఎక్కువగా ఉంది. రైతులు బంతి, చామంతి పూల సాగు చేపట్టారు. వీరికి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తాం.

–మధుసూదన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

తెలంగాణలోకి ఏపీ ధాన్యం..!

- మార్కెట్ అధికారులు సెస్ వసూలు చేసి అనుమతిచ్చిన వైనం
- పౌరసరఫరాలశాఖ అధికారులు అడ్డుకుని తిరిగి ఏపీకి తరలింపు
- రెండు శాఖల మధ్య సమన్వయలోపం..



వల్లబి చెక్‌పోస్టు వద్ద భారీగా ఆగిన ధాన్యం లారీలు

నేలకొండపల్లి/ముదిగొండ: ఏపీ నుంచి అక్రమంగా ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నట్లు సమాచారం. 20 రోజుల నుంచి ఈ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల మధ్య సమన్వయ లోపంతో నిబంధనలు ఉల్లంఘించి ఏపీ నుంచి దర్జాగా రాష్ట్రంలోకి ధాన్యం తరలుతోంది. ఆదివారం ఏపీ నుంచి వచ్చిన లారీలను నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం, ముదిగొండ మండలంలోని వల్లభి వద్ద గ్రామస్తులు అడ్డుకున్నారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, వల్లభి చెక్‌పోస్టు సిబ్బంది సైతం ధాన్యం లారీలను అడ్డుకున్నారు. కానీ, మార్కెట్ అధికారుల సూచనలతో సిబ్బంది దాదాపు 60 లారీలకు రూ.3.40 లక్షలు, పైనంపల్లి చెక్‌పోస్టు వద్ద మరో 5 లారీల నుంచి దాదాపు రూ.35 వేల వరకు సెస్సు తీసుకుని లారీలను రాష్ట్రంలోకి పంపించారు. అవి చెరువుమాధారం వద్దకు రాగానే గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. పోలీసులు వచ్చి లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీడ్రైవర్ల వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంకా ఏపీ నుంచి లారీలు వస్తున్న విషయం తెలుసుకున్న సివిల్ సప్లై డీఎస్‌ఓ చందన్‌కుమార్, ఆర్‌ఐ నరేశ్, ముదిగొండ తహసీల్దార్ సునీతఎల్జిబెత్, ఆర్‌ఐ ప్రసన్నకుమార్.. ఏపీ లారీలను ఏపీకే పంపించారు. దీంతో ఇరు శాఖల మధ్య సమన్వయం లేక ఏపీ అక్రమార్కులు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను కొల్లగొట్టే ప్రయత్నాలు చేసినట్లు తేలింది. ఈ విషయంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి నాగేశ్వరిని వివరణ కోరగా.. రశీదు లేకుంటే ఏ వాహనమైనా సరే సెస్ కట్టిస్తామని, మిగతా వాటితో తమకు సంబంధం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన లారీలను ఏపీకి తిప్పి పంపినట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు.

మోటారు రంగాన్ని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న పాయం వెంకన్న

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): స్వయం ఉపాధి రంగమైన ఆటో మోటార్ రంగాన్ని కాపాడుకుందామని మోటార్ రంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ కంకణాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా వెంకన్న పాల్గొని మాట్లాడారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆటో కార్మికులు అడ్డాలపై కూర్చొని దీనస్థితిలో ఉంటున్నారని, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో మహిళలకు వరమైంది కానీ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు శాపంగా మారిందని ఆరోపించారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రోడ్‌సేఫ్టీ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో డీజిల్ పెట్రోల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రికల్ వాహనాల వాడకాన్ని పెంచే విధానాన్ని ప్రభుత్వం అవలంబిస్తోందని, అడ్డగోలుగా ఆటోలు తొలగించడం కాదని, వాటి స్థానంలో ఎలక్ట్రికల్ వాహనాలను ప్రభుత్వమే సబ్సిడీతో అందించాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్కె లాల్‌మియా, ఎడ్లపల్లి ఉపేందర్, ఎలదండి బాబు, కె.శ్రీనివాస్, ములకలపల్లి లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా కంకణాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా బండారి భద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్కె లాల్‌మియా, జిల్లా సహాయ కార్యదర్శిగా ఎడ్లపల్లి ఉపేందర్ కోశాధికారిగా ములకలపల్లి లక్ష్మీనారాయణతోపాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు. భార్యభర్తలైన ఇద్దరు మావోయిస్టులతో పాటు మరో ముగ్గురు లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో ఒక మహిళా మావోయిస్టుపై రూ.8 లక్షల రివార్డు ఉండగా, మిగిలిన నలుగురిపై రూ.17 లక్షల రివార్డులు ఉన్నట్లు చెప్పారు. స్వచ్ఛందంగా లొంగిపోయేందుకు వచ్చే మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి పునరావాసం కల్పిస్తామని, వారిపై ఉన్న కేసులన్నీ ఎత్తివేస్తామన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం



మాట్లాడుతున్న విజయ్‌రామ్

ఖమ్మంవ్యవసాయం: సేంద్రియ ఉత్పత్తుల వినియోగం మానవుని ఆయుష్షు పెంచుతాయని, ఆరోగ్యాన్నిస్తాయని ప్రకృతి సేద్య నిపుణులు విజయ్‌రామ్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఈఆర్‌ఆర్ రిసార్ట్స్‌లో రైతుబంధు మాజీ జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. భూమికి రసాయనాలు ఇచ్చి విషతుల్యం చేయొద్దన్నారు. రసాయనాల వినియోగంతో సమస్త జీవరాశుల జీవన విధానం, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో యువ రైతులకు ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని వెల్లడించారు. సేంద్రియ సాగులో ఐదెంచెల పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయ శాస్త్రవేత్త చల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఉందని, రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను సాధించే ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. సదస్సులో జిల్లా రైతు సంఘం నాయకులు మాదినేని లక్ష్మి, నరేంద్ర స్వరూప్, కుతుంబాక మాధవి, వెంకట్రామిరెడ్డి, రాణాప్రతాప్, రామారావు, శ్రీనివాసరావు, రామిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరంపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని గాంధీనగర్ కాలనీ గ్రామానికి చెందిన షేక్ మదార్‌సాహెబ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మదార్ సాహెబ్ ఫోన్లో ఫేస్‌బుక్ చూస్తుండగా సెల్ టవర్‌కు సంబంధించిన ప్రకటన రావడంతో దానిపై క్లిక్ చేశాడు. దీంతో సైబర్ నేరగాడు సెల్ టవర్ ఇప్పిస్తానని అతని ఖాతాకు రూ.1,07,240ను విడతల వారీగా జమ చేయించుకున్నాడు. ఎంతకీ స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోటార్లు చోరీ చేయబోయిన దుండగులు..!



దుండగులు వదిలేసిన పరికరాలు

నేలకొండపల్లి: మోటార్ల చోరీకి వచ్చిన దుండగులు రైతులను గమనించి పారిపోయిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కోనాయిగూడెం గ్రామంలో అర్ధరాత్రి మోటార్లు చోరీ చేసేందుకు కొందరు ప్రయత్నించగా రైతు బోయినపల్లి కొండలు గమనించి.. కోనాయిగూడెం, ఆరెగూడెంనకు చెందిన రైతులు చింతమళ్ల ఆనందరావు, మేకల వెంకయ్య, ఉపేందర్, మనోజ్, లక్ష్మణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఈ క్రమంలో కొండలుకు చెందిన మోటారును విప్పి కాపర్ వైరును సంచిలో వేసి ఉంచారు. మిగతా రైతులు అక్కడికి చేరుకోగానే గమనించిన దుండగులు పారిపోయారు. రైతులు వెంబడించినా దొరకలేదు. కాజేయాలని చూసిన కాపర్ వైరు, వారు తెచ్చుకున్న మోటార్లు విప్పే పరికరాలు అక్కడే వదిలిపెట్టారు.

దుర్భాషలాడుతూ దండించి..

మెనూ పాటించని వార్డెన్

- ప్రశ్నించిన బాలుడిపై దండన
- బాధిత కుటుంబసభ్యుల ఆందోళన



హాస్టల్ ఎదుట వార్డెన్‌ను నిలదీస్తున్న విద్యార్థి బంధువులు

మణుగూరుటౌన్: హాస్టల్‌లో మెనూ పాటించకుండా వార్డెన్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని చెప్పిన ఓ బాలుడిపై చేయి చేసుకున్న ఘటనపై బాధిత కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించారు. బాధితుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో శనివారం కొత్త మెనూ ప్రకారం భోజనాలు వడ్డించి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ బాలుడు, తల్లిదండ్రులను కలిశాక మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా వార్డెన్ వ్యవహరిస్తున్నాడని సభాముఖంగా తెలిపాడు. దీంతో అదే రోజు సాయంత్రం ఆగ్రహానికి గురైన వార్డెన్ దుర్భాషలాడుతూ దండించి తరిమేయడంతో ఇంటికి చేరాడని ఆరోపించారు. హాస్టల్‌లో ఉండకుండా భద్రాచలం నుంచి వస్తూ అధికారులను మచ్చిక చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, హాస్టల్‌లో పరిశుభ్రత పాటించకపోతే ఒకరోజు తమ కుటుంబసభ్యులంతా కలిసి తాగునీటి ట్యాంకులు, పరిసరాలు శుభ్రం చేశామని వివరించారు. మెనూ పాటించకపోతే ఎవరికైనా ఫిర్యాదు చేయాలంటేనే ఇంటికి పంపించేస్తాను పేరు తీసేస్తానంటూ ఇక్కడ ఉండే విద్యార్థులను భయపెట్టి లబ్ధిపొందుతున్నాడంటూ వార్డెన్‌తో వాగ్వివాదానికి దిగారు. వార్డెన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎలర్జీ రావడంతో ఇంటికి పంపానని చెప్పాడు. మెనూ ప్రకారం ఎందుకు పెట్టడం లేదన్న విషయంపై స్పందించలేదు.

వివాదాస్పద వార్డెన్..

- ఎస్సీ బాలుర వార్డెన్ వ్యవహార శైలి తరచూ వివాదాస్పదంగా మారుతోంది. విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించడం నుంచి మధ్యాహ్న వర్కర్లతో ఇష్టానుసారంగా బెదిరింపులకు పాల్పడడంతో అక్టోబర్ 28న హాస్టల్ ముందర బైఠాయించారు.
- ఏఎస్‌డబ్ల్యూ హనుమంతరావు పేరిట ఓ మధ్యాహ్న వర్కర్‌ను రూ.10వేల లంచం డిమాండ్ చేయడంతో వారి ఫిర్యాదు మేరకు ఆయనే అక్టోబర్ 29న విచారణ నిర్వహించి అధికారులకు నివేదించినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- తరచూ విద్యార్థుల నుంచి వస్తున్న ఫిర్యాదులతో ఇప్పటికీ రెండు నెలల వ్యవధిలో మూడుసార్లు స్థానిక తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ తెళ్లూరి శ్రీనివాసరావు వార్డెన్‌కు తీరు మార్చుకోవాలని హెచ్చరికలు జారీచేశారు. అయినా వార్డెన్ వ్యవహార తీరులో మార్పు రాకపోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్‌ను మార్చి తమకు ఇబ్బందుల నుంచి విముక్తి కలిగేలా చూడాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

మహాసభలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం

సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి కనకయ్య

ఇల్లెందు: ఈ నెల 20, 21 తేదీల్లో ఇల్లెందులో సీపీఎం జిల్లా మహాసభలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గుట్టగా పేరుగాంచిన ఇల్లెందులో మొదటిసారి జరుగుతున్న జిల్లా మహాసభల్లో రాబోయే ఉద్యమ కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ సందర్భంగా మహాసభల నిర్వహణ అడహక్ కమిటీ సభ్యులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర జిల్లా నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి కిరణ్, మల్లయ్య, కృష్ణ, మోహన్‌రావు, సుల్తానా, సంధ్య, వెంకటేశ్వర్లు, మరియా, బోస్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు..

సీపీఎం జిల్లా మహాసభలకు ఇల్లెందులో సన్నాహాలు సాగుతున్నాయి. వారం రోజులుగా పట్టణంలో వాల్‌రైటింగ్ సాగుతోంది. సుమారు 400 మంది ప్రతినిధులు హాజరువుతున్న సందర్భంగా ఇల్లెందులో నేతల సందడి మొదలవుతోంది. రాష్ట్ర, జిల్లా నేతలు తరలి రానుండడంతో ఇల్లెందుకు ఎర్రబారనుంది.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన వివాహిత (22) ఆదివారం పేలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక వైద్యశాలకు తరలించగా.. ప్రథమచికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నేలకొండపల్లి: పురుగులమందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి (45) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు రోజుల కిందట పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాఠశాల హెచ్‌ఎం రమేశ్, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు జెర్రిపోతుల సత్యానారాయణ, మన్నె కృష్ణారావు, శీలం వెంకటలక్ష్మి, జెర్రిపోతుల అంజిని తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు...

వేంసూరు: విద్యుదాఘాతంతో గ్రీన్ ఫీల్డ్ హైవే కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం ఎర్రగుంటపాడు రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రెడ్డి భాస్కర్‌రావు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం భాస్కర్‌రావు పనిచేస్తున్న వాహనానికి విద్యుత్ షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

టాటా ఏస్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో నుజ్జు అయిన కారు

పెనుబల్లి: మండలంలోని లంకపల్లి జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు అవగా కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో పెనుప్రమాదం తప్పింది. ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో సత్తుపల్లి - ఖమ్మం జాయతీ రహదారిపై పలు వాహనాలు నిలిచిపోయిట్రాఫిక్ సమస్య తలెత్తింది.

జగన్ హయాంలో జీఎస్‌డీపీ జోరు

రూ.1.94 లక్షల కోట్లు పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి

ఆర్‌బీఐ నివేదికలో వెల్లడి



- స్థిర ధరల ఆధారంగా ఐదేళ్లలో జీఎస్‌డీపీ 31.04 శాతం వృద్ధి
- వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ రంగం వృద్ధి 16.46 శాతం
- రెండేళ్లు కోవిడ్ సంక్షోభంలోనూ తయారీ రంగం 58.39 శాతం వృద్ధి
- ఐదేళ్లలో పారిశ్రామిక రంగం 46.62%.. నిర్మాణ రంగంలో 41.50% వృద్ధి
- విద్య, వైద్యం, తాగునీరు, సంక్షేమం, పారిశుద్ధ్యం, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పౌష్టికాహారానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ వైఎస్ జగన్ 'సామాజిక' అడుగులు
- సామాజిక రంగంపై రూ.5.22 లక్షల కోట్లు వెచ్చించిన జగన్
- బాబు హయాంలో తలసరి ఆదాయం రూ.1,54,031
- జగన్ పాలనలో రూ.2,42,479కి పెరిగిన తలసరి ఆదాయం
- టీడీపీ హయాంలో తలసరి విద్యుత్ లభ్యత గంటకు 1,289.4 కిలోవాట్
- వైఎస్సార్‌సీపీ హయాంలో తలసరి విద్యుత్ లభ్యత గంటకు 1,623.0 కిలోవాట్
- వైఎస్ జగన్ పాలనలో రూ.1.35 లక్షల కోట్లు అదనంగా పెరిగిన రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విజన్ 2047.. ఓ డొల్ల డాక్యుమెంట్

మరోసారి చంద్రబాబు పబ్లిసిటీ స్టంట్: 'ఎక్స్'లో వైఎస్ జగన్ ధ్వజం

- బాబు పాలనలో మొత్తం విజన్లు.. చరిత్రలో నిలిచిపోయే పని ఒక్కటైనా చేశారా?
- ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా? స్కూళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేశారా? రైతులకు అండగా నిలిచారా?
- మరి ఇంకెందుకు ఈ విజన్ డాక్యుమెంట్లు?
- రాష్ట్రం, ప్రజల అవసరాలకు చోటెక్కడ? వాస్తవిక దృక్పథం ఏది?
- ఆయన దృష్టంతా ప్రజలను మోసం చేయడం, మాయ చేయడంపైనే
- విజన్ డాక్యుమెంట్లు పేరిట ఇలా అబద్ధాలాడితే జైలుకో, ఆస్పత్రికో పంపిస్తామన్న నాటి స్విట్జర్లాండ్ ఆర్థిక మంత్రి పాస్కల్
- బాబు 14 ఏళ్ల పాలనలో రెవెన్యూ లోటు మినహా ఎన్నడైనా మిగులు ఉందా?
- ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి.. సంపదను ఆవిరి చేసే సంస్కృతి చంద్రబాబుది
- వైఎస్సార్ సీపీ అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగారుస్తూ.. రద్దు చేస్తున్నారు
- మేం సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి బాబు ప్రయత్నిస్తున్నారు
- పేదలను మరింత పేదవాళ్లుగా తయారు చేస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: విజన్ 2047 పేరిట ప్రజలను మభ్యపుచ్చి మాయ చేసేందుకు సీఎం చంద్రబాబు మరోసారి పబ్లిసిటీ స్టంట్‌కు దిగారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు పత్రంలో రాష్ట్రం, ప్రజల అవసరాలకు చోటే లేదని ధ్వజమెత్తారు. వాస్తవిక దృక్పథం అంతకన్నా లేదన్నారు. ఆయన దృష్టి ఎప్పుడూ ప్రజలు తనకిచ్చిన ఐదేళ్లలో మేనిఫెస్టో హామీల అమలుపై ఉండదని దుయ్యబట్టారు. ఎప్పుడూ ప్రజలను మోసం చేయడం, మాయ చేయడం మీదనే ఆయన ధ్యాసంతా ఉంటుందని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే...

- 1998లో కూడా చంద్రబాబు విజన్–2020 పేరిట డాక్యుమెంట్ విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. రైతుల ఆత్మహత్యలు, ఉపాధి లేక వలసలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగుల అష్టకష్టాలు.. వీటన్నింటినీ దాచేసి చంద్రబాబు తన విజన్ చుట్టూ నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదు. ప్రైవేటీకరణ పేరుతో విలువైన ప్రభుత్వ ఆస్తులను పప్పు బెల్లాల మాదిరిగా తన మనుషులకు కట్టబెట్టి అవినీతికి పాల్పడ్డారు. నాడు స్విట్జర్లాండ్‌కు చెందిన ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా విజన్ డాక్యుమెంట్ల పేరిట ఇలా అబద్ధాలు చెప్పేవారిని తమ దేశంలో జైలుకో లేకపోతే ఆస్పత్రికో పంపిస్తామని కామెంట్ చేశారు. చివరకు ప్రజలు కూడా విజన్ 2020 కాదు.. 420 అంటూ చంద్రబాబు తీరును దుయ్యబట్టారు.
- 2014లో కూడా చంద్రబాబు విడుదల చేసిన విజన్ 2029 డాక్యుమెంట్ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయింది. తన పరిపాలనలో మొత్తం విజన్లు ప్రకటించిన చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయే పని ఒక్కటైనా చేశాడా? ప్రభుత్వానికి మేలు జరిగే విధంగా ఒక్క ప్రాజెక్టు అయినా కట్టాడా? ఒక్క పోర్టుగానీ ఫిషింగ్ హార్బర్లుగానీ కట్టాడా? ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా? స్కూళ్లు బాగు చేశారా? ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేశారా? వ్యవసాయ రంగాన్ని బాగు చేశారా? చెప్పుకోదగ్గ ఉద్యోగాలు ఏమైనా ఇచ్చారా? మానవ వనరుల అభివృద్ధి మీద, యువత భవిష్యత్తు మీద ఒక్క పైసా అయినా ఖర్చు చేశారా? ఒక్కటంటే ఒక్కటి కూడా చేయలేదు. మరి ఇంకెందుకు ఈ విజన్ డాక్యుమెంట్లు?



- ఎన్నికలలో తానిచ్చిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ సహా ఇతర హామీలకు తూట్లు పొడుస్తూ మోసాలు, అబద్ధాలతో ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తున్న చంద్రబాబు ఇప్పుడు మళ్లీ విజన్ 2047 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం మరో డ్రామా, స్టంట్ కాదా? ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడిని చీటర్ అంటారు. అంతేగానీ విజనరీ అంటారా?
- చంద్రబాబు పాలనలో, ఆయన 14 ఏళ్ల పరిపాలనలో ఎప్పుడూ రెవెన్యూ లోటే కనిపిస్తుందన్న మాట వాస్తవం కాదా? మరి ఇంకెక్కడి సంపద సృష్టి? ఆయన పాలించిన ఏ ఒక్క సంవత్సరంలోనైనా రెవెన్యూ మిగులు ఉందా? ఆయనకు సంపద సృష్టించే శక్తి లేదు. సమగ్ర ఆర్థిక నియంత్రణ కూడా లేదు. ఇప్పుడు విజన్ 2047 ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు చెప్పడం కట్టుకథ కాదా?
- సహజంగా ఏ రాష్ట్రంలోనైనా కాలం గడుస్తున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ వస్తుంది. ఇప్పటి నుంచి వచ్చే 10 ఏళ్లు తీసుకున్నా లేక గతంలో 10 ఏళ్ల లెక్కలు తీసుకున్నా ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ద్రవ్యోల్బణం వల్ల, సహజంగా వచ్చే పెరుగుదల వల్ల వృద్ధి చెందుతూ ఉంటుంది. కానీ సంపద సృష్టి ఎప్పుడూ చేయని చంద్రబాబు.. ఎప్పుడూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి సంపదను ఆవిరి చేసే ఈ బాబు.. ఆ పెరుగుదల తన వల్లే అని చెప్పుకుంటూ ఉంటారు. అందుకే ఈ మోసగాడిని మాత్రమే 420 అని అంటారు.

మేం ఏం చేశామో చూడండి..

- రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ అసమానతలు రూపుమాపి అందరికీ సమాన అవకాశాలు కల్పించి, సుస్థిర అభివృద్ధి దిశగా వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక చర్యలు తీసుకున్నాం. విద్యారంగంలో సీబీఎస్‌ఈ, ఐబీ, పిల్లలకు ట్యాబ్‌లు, వ్యవసాయంలో ఆర్బీకే వ్యవస్థ, ఈ క్రాప్, ఫామ్‌గేట్ వద్దే మద్దతు ధరకు పంటల కొనుగోళ్లు, నాడు – నేడు ద్వారా ఆసుపత్రుల బలోపేతం, కొత్తగా ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లు, ఉపాధి కల్పనా రంగంలో మైక్రోసాఫ్ట్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఎడెక్స్‌తో ఒప్పందం ద్వారా అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ లాంటి పలు విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టాం.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలు, కార్యక్రమాలను చంద్రబాబు నీరు గారుస్తున్నారు, రద్దు చేస్తున్నారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి కల్పన, సుపరిపాలనలో తీసుకున్న విప్లవాత్మక సంస్కరణలు ఎన్నింటినో దెబ్బ తీశారు. ప్రభుత్వ రంగంలో సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు.
- సమాజంలో అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చి వారి జీవన ప్రమాణాలు పెంచి పేదరికాన్ని నిర్మూలించే దిశగా గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలన్నింటినీ తీసివేసి పేదలను మరింత పేదవాళ్లుగా చంద్రబాబు తయారు చేస్తున్నారు. మరి చంద్రబాబుకు విజన్ ఉందని ఎలా అనుకుంటారు?

స్థిరంగా కొనసాగుతున్న అల్పపీడనం

- నేడు తీవ్ర అల్పపీడనంగా మారే ఛాన్స్
- 18న తమిళనాడులో తీరం దాటే అవకాశం
- రేపు దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వానలు

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. రాబోయే 24 గంటల్లో ఇది బలపడి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అనంతరం దిశ మార్చుకుని పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణిస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 18వ తేదీన ఉదయం తమిళనాడు రాష్ట్రంలో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో మంగళవారం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. తీరం వెంబడి 30 నుంచి 35 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. దక్షిణ కోస్తా జిల్లాల్లోని మత్స్యకారులు ఈ నెల 18 వరకూ వేటకు వెళ్లవద్దని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెనాలి యువతి దుర్మరణం

- రెండు రోజుల్లో ఎంఎస్ పట్టా చేతికి..
- అంతలోనే ప్రాణాలు విడిచిన నాగశ్రీ వందన పరిమళ


నాగశ్రీ వందన

తెనాలి : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెనాలి యువతి నాగశ్రీ వందన పరిమళ(26) దుర్మరణం పాలైంది. సూరె గణేష్, రమాదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె నాగశ్రీ వందన పరిమళ. డేటా అనలటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు 2022లో అమెరికా వెళ్లి.. మెంఫిస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసింది. సోమవారం జరిగే యూనివర్సిటీ కాన్వొకేషన్‌లో ఎంఎస్ పట్టా తీసుకుంటానన్న సంతోషంలో ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ఎవరినో రిసీవ్ చేసుకునేందుకు స్నేహితులతో కలిసి కారులో బయలుదేరింది. అదే రోజు రాత్రి 2.30 గంటల సమయంలో ఆమె ప్రయాణిస్తున్న కారు రోడ్డుపై నిలిపి ఉండగా.. వేగంగా వస్తున్న ట్రక్ ఢీకొట్టింది. ప్రమాదంలో నాగశ్రీ వందన పరిమళ అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదం జరగడానికి అరగంట ముందు ఇంటికి ఫోను చేసి తల్లి రమాదేవితో మాట్లాడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది.

జిల్లా వార్తలు

'ఓపెన్'లో అడ్మిషన్లకు నేటి వరకు గడువు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు ఈనెల 16 వరకు అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, ఉమ్మడి జిల్లాల ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర విద్యా విధానంలో చదువుకునేందుకు ఆసక్తి గల అభ్యాసకులు సంబంధిత ఓపెన్ స్కూల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించి అడ్మిషన్ పొందాలని సూచించారు. వివరాలకు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోల్‌కతా మారథాన్‌లో ఖమ్మం పోలీసుల సత్తా

ఖమ్మంక్రైం : పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జరిగిన 25 కిలోమీటర్ల మారథాన్ పరుగు పందెంలో ఖమ్మం కమిషనరేట్ పోలీసులు సత్తా చాటారు. పతకాలు సాధించిన వారిలో ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటకృష్ణ, సీసీఎస్ కానిస్టేబుల్ గజేంద్రతోపాటు హైదరాబాద్‌లో పనిచేస్తున్న అగ్నిమాపకశాఖ డీఎస్పీ ప్రసాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎన్నికల విభాగం ఇన్‌చార్జ్ డి.ప్రసాద్, ఖమ్మంలో చదువుతున్న విద్యార్థి రాజు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటకృష్ణ, కానిస్టేబుల్ గజేంద్రను పోలీసులు అభినందించారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం


నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల కేంద్రీయ విద్యాలయంలో 62వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాల కళ, సాంస్కృతిక సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు కళా విన్యాసాలు, నాటికలు ప్రదర్శించారు. అనంతరం విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశంలో కేంద్రీయ విద్యాలయాలు ఉండగా ప్రపంచ వ్యాప్తంగా కేవీఎస్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సైబర్'.. సరికొత్త పంథా!

- రకరకాల ఎత్తుగడలతో ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్న నేరగాళ్లు
- రూ.లక్షల్లో నగదు కోల్పోతున్న జనం
- అవగాహనే ముఖ్యమంటున్న పోలీసులు
- అత్యాశకు వెళ్తే నష్టమే తప్ప లాభముండదని ప్రచారం



గతంలో ఓఎల్‌ఎక్స్‌లో ఖరీదైన వస్తువుల ఫొటోలు పెట్టి తక్కువకే ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు తమ ఖాతాల్లోకి డబ్బు మళ్లించుకుని ముఖం చాటేసేవారు. ఆ తర్వాత ఫలానా కంపెనీ తీసిన డ్రాలో రూ.కోటి బహుమతి వచ్చిందని నమ్మబలుకుతూ టాక్స్ పేరిట డబ్బు దండుకునేవారు. ఆపై బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయిందని పిన్ వివరాలు తెలుసుకుని డబ్బు కాజేశారు. అయితే, ఇలాంటి మోసాలపై ప్రజలకు అవగాహన పెరగడంతో సైబర్ నేరగాళ్లు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సరికొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారు. – ఖమ్మంక్రైం

మోసం.. అనేక రకాలు

ప్రస్తుతం సైబర్ నేరాలు 21 రకాలుగా జరుగుతున్నాయని నిపుణులు చెబుతుండగా ఇందులో ఐదింటిని సైబర్ నేరగాళ్లు ఉపయోగిస్తున్నారు. తెలియకుండా కంప్యూటర్‌లోకి ప్రవేశించి సమాచారాన్ని లాగేసుకోవడం మొదటిది. ఇక బ్యాంకు ఖాతా నుంచి రూ.10 మొదలు రూ.100 వరకు స్వాహా చేయడాన్ని సలామీ అటాక్ అంటారు. ఒక్కో ఖాతా నుంచి రూ.10 చొప్పున లాక్కున్నా 10 లక్షల ఖాతాల్లో లెక్కేస్తే భారీ మొత్తమే అవుతుంది. అందుకే ఎవరైనా ఖాతా నుంచి డబ్బు మినహాయించినట్లు తెలిస్తే వెంటనే బ్యాంకుల్లో సంప్రదించాలి. ఇక పాస్‌వర్డ్ తెలుసుకుని నగదు స్వాహా చేయడం వంటివి ఉన్నాయి. నెట్‌ఫ్లిక్స్ వంటివి ఉచితంగా వస్తాయని గుర్తిస్తే ఫోన్ లేదా మెయిల్‌కు హ్యాకర్లు మెసేజ్ పంపిస్తారు. దీన్ని నమ్మి లింక్ ఓపెన్ చేస్తే కొన్ని వివరాలు నమోదు చేయాలని సూచిస్తూ ఆ తర్వాత అకౌంట్‌లోని డబ్బు మాయం చేస్తారు.

హవాలా సొమ్ము, డ్రగ్స్ పేరుతో మోసం..

సైబర్ కేటుగాళ్లు వాట్సాప్ కాల్ చేసి 'మీ బ్యాంక్ ఖాతాలో హవాలా సొమ్ము ఉంది. డబ్బు ఎక్కడ నుంచి వచ్చింది. వెంటనే మిమ్మల్ని అరెస్ట్ చేయడానికి పోలీసులు వస్తార'ంటూ మాట్లాడుతారు. దీంతో ఏమీ అర్థం కాక అయోమయంలో ఉన్న బాధితుడుకి మళ్లీ కాసేపటి తర్వాత ఫోన్ చేసి అర్జెంట్‌గా ఒక అకౌంట్‌కు ఇన్ని లక్షలు పంపిస్తే పోలీసులు రావడం ఆగిపోతుంది.. లేదంటే పెద్ద కేసు అవుతుందని చెబుతారు. దీంతో కంగారు పడిన బాధితులు వారి అకౌంట్‌కు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తారు. లేదంటే మీ పార్సిల్‌లో డ్రగ్స్ దొరికాయని, ముంబై నుంచి పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారని బెదిరిస్తారు. మేమేం పార్సిల్ బుక్ చేయలేదు.. మాకు సంబంధం లేదంటే తాము కస్టమ్స్ అధికారులమంటూ బుకాయిస్తారు. ఇలా కొందరు బాధితులు షాక్‌లో ఉండగా రూ.లక్ష, రెండు లక్షలు ఫలానా అకౌంట్‌లో వేయండి.. పోలీసులు రాకుండా చూస్తామంటూ మోసం చేస్తుంటారు.

ఆన్‌లైన్ పార్సిల్ స్కాం..

ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ పార్సిళ్లపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఎందుకంటే ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్‌లైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి వాటిల్లో చౌకధరకు విలువైన వస్తువులు ధర తగ్గించి ఆఫర్లు పెడుతుంటాయి. దీంతో చాలా మంది తమకు నచ్చిన వస్తువు బుక్ చేసుకుంటారు. దీనిపై సైబర్ నేరగాళ్లు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆర్డర్ పెట్టకపోయినా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాగానే ఉండే పార్సిల్ తీసుకొచ్చి 'సార్ మీకు పార్శిల్ వచ్చింద'ని చెబుతారు. తామేమీ ఆర్డర్ చేయలేదంటే 'క్యాన్సిల్ చేస్తా.. మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది చెప్పండి' అంటాడు. ఓటీపీ చెప్పి.. అతడు వెళ్లిపోయిన కొద్ది నిమిషాలకే మీ బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు డ్రా చేసినట్లు మెసేజ్ వస్తుంది.

చార్జింగ్ స్టేషన్లలోనూ..

సైబర్ నేరగాళ్లు చార్జింగ్ స్టేషన్ల నుంచి కూడా వ్యక్తిగత సమాచారం దొంగిలిస్తున్నారు. పబ్లిక్ చార్జింగ్ పోర్ట్‌లు, పోర్టబుల్ వాల్ చార్జర్లను వాడొద్దని, అత్యవసరమైతే గోడకు అమర్చిన సాకెట్‌ను మాత్రమే వాడాలని ఆర్‌బీఐ అధికారులు సూచిస్తున్నారు. క్యూర్ కోడ్స్‌తో చేసే స్కానింగ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. సైబర్ నేరాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని, మోసానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని చెబుతున్నారు.



ఒక్క ఓటీపీతో తలకిందులు..

హడావుడిలోనే నిజమేననే భావనతో అపరిచితులకు ఓటీపీ చెబితే పరిస్థితులు తారుమారవుతాయి. ప్రస్తుతం ప్రతీ పనిలో సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ కీలకంగా మారింది. గ్యాస్ సిలిండర్ డెలివరీ మొదలు ఆన్‌లైన్‌లో వచ్చే పార్సిళ్ల వరకు దేనికైనా ఇది తప్పనిసరి. ఇదే అదనుగా భావిస్తున్న కేటుగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ కొంప ముంచుతున్నారు. ఓటీపీ చెప్పిక కళ్లు మూసి తెరిచేలోగా బ్యాంకు ఖాతా ఖాళీ చేస్తున్నారు. అందుకే ఓటీపీ చెప్పాల్సి వస్తే అధీకృత వ్యక్తులు, సంస్థలకు తప్ప మరొకరికి దూరంగా ఉండడమే మంచిది.

అప్రమత్తంగా ఉండాలి



నానాటికీ పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పెరుగుతున్న ఆధునిక పరిజ్ఞానాన్ని వాడుకుని నేరగాళ్లు వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. లోన్‌లు ఇస్తామని, లాటరీ తగిలిందని లింక్‌లు పెడుతుంటారు. ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించొద్దు. అపరిచితులు ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారం, పిన్ నంబర్, ఓటీపీలు చెప్పొద్దు. సోషల్ మీడియా ఎక్కువగా వాడేవారు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. ప్రొఫైల్‌లాక్ తదితర విషయాలపై జాగ్రత్తగా ఉండాలి. జిల్లాలో ఇప్పటివరకు 350కి పైగా సైబర్ ఫిర్యాదులు వచ్చాయి. రూ. 2 కోట్లకు పైగా బాధితులు పోగొట్టుకోగా రూ. 25 లక్షలకు పైగా బ్యాంక్‌లో సైబర్ సెక్యూరిటీ పోలీసులు బాధితుల సొమ్మును హోల్డ్ చేసి కాపాడారు. – సునీల్ దత్, సీపీ, ఖమ్మం

గురువులను గుర్తుపట్టేలా..


సుర్దేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

- పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలు
- ఇక వలంటీర్ల బోధనకు చెక్
- ఫొటోల సేకరణలో హెచ్‌ఎంలు
- బోధన బాగుండాలని విద్యాశాఖ చర్యలు
- కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు

నేలకొండపల్లి: పాఠశాలలో విద్యార్థులకు అందించే బోధన బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమూలమైన మార్పులు తీసుకొస్తుంది. పాఠశాలలకు రాకుండా అక్కడక్కడ ఉపాధ్యాయులు దుమ్మాలు కొట్టడం, దీర్ఘకాలికంగా పాఠశాలకు రాకుండా వలంటీర్లతో బోధన చేయిస్తుండడం గతంలో పలు చోట్ల వెలుగు చూశాయి. ఇక నుంచి అలా జరగకుండా ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయుల ఫొటోలను ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలు 2259, ప్రాథమికోన్నత పాఠశాలలు–726, ఉన్నత పాఠశాలలు 582లతో పాటు గురుకులాలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేయాలని ఆయా మండల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అందరికీ కనిపించేలా..

జిల్లాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో పని చేసే ఉపాధ్యాయుల ఫొటోలను అందరికీ కనిపించేలా ఉపాధ్యాయులతో కూడిన ఫొటోల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయకులను కొందరు గ్రామస్తులు గుర్తుపట్టడం కష్టంగా మారుతున్న నేపథ్యాన అప్పుడప్పుడు పాఠశాలకు వచ్చే వారికైనా తెలిసేలా ఫొటోలను ప్రదర్శిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఒకరికి బదులు మరొకరు పని చేయడానికి ఏ మాత్రం వీలు లేకపోవడంతో పాటు ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఇలా పని చేసే వారికి చెక్ పెట్టే అవకాశం ఉంది.



బుద్ధారం పాఠశాలలో ఫొటోలు, వివరాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఫొటోల సేకరణలో ప్రధానోపాధ్యాయులు..

విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలను సేకరించే పనిలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. గతంలో కేవలం ఉపాధ్యాయులకు సంబంధించి వివరాలు మాత్రమే ఉండేవి. ఇక నుంచి వివరాలతో పాటు పక్కనే వారి ఫొటోలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలంలోని బుద్ధారం ప్రాథమిక పాఠశాలలో గతంలోనే సివిల్ లిస్ట్‌లో ఉపాధ్యాయుల ఫొటోలతో కూడిన వివరాలతో ఏర్పాటు చేశారు.

ఆదేశాలు జారీ చేశాం..



ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయుల ఫొటోలతో కూడిన వివరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. దీని వలన పారదర్శకత పెరిగి పిల్లలకు మేలు జరుగుతుంది. కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇకనుంచి నాణ్యమైన విద్యాబోధన అందుతుంది.
– సోమశేఖర్‌శర్మ, డీఈఓ, ఖమ్మం

అక్రమాలకు ఆస్కారం ఉండదు



పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎవరు బోధిస్తున్నారే విషయం చాలా మంది గ్రామస్తులకు తెలియదు. ఇలా ఫొటోలు ప్రదర్శించడం వలన ఒకరికి బదులు మరొకరు రాకుండా ఉండడంతో పాటు ఎలాంటి అక్రమాలకు ఆస్కారం ఉండదు.
– మారిశెట్టి వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి

జవాబుదారీతనం పెరుగుతుంది



సివిల్ లిస్ట్‌లో ఉపాధ్యాయుల వివరాలు ఉంచడం వలన ఉపాధ్యాయులకు మరింత జవాబుదారీతనం పెరుగుతుంది. ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ఎవరనే విషయం స్థానికులకు తెలుస్తుంది. అందరికీ అన్ని విధాలుగా మంచిదే.
– టి.వెంగళరావు, ఉపాధ్యాయ సంఘం నేత, నేలకొండపల్లి